సంపూర్ణ ఆరోగ్యానికి సురక్ష

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుంది. ఊరూరా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల నాడి పడుతున్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 258 మంది రోగులు హాజరయ్యారు. వారికి వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ యూనికా మెర్సీ, డాక్టర్ ముకేష్‌కుమార్, డాక్టర్ అంజనీదేవిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను అందించారు. తీవ్ర అనారోగ్య సమస్యలున్న పదిహేను మందిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు రెఫర్ చేసినట్లు ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి తెలిపారు.

ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రతే జగనన్న లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కల్పించి ప్రజలంతా ఆరోగ్యంగా జీవించాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టటం జరిగిందని రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లవరం గ్రామంలోని జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ మెగా మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్యాంప్‌లో బీపీ, షుగర్, గుండె జబ్బులు, కాళ్ళు, కీళ్ళ నొప్పులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, కళ్ళు తదితర ప్రతి సమస్యను ప్రత్యేక వైద్యులు పరీక్షించి మందులు అందజేయటం జరుగుతుందన్నారు. మెరుగైన చికిత్సలకు జీజీహెచ్, ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 562 మంది ప్రజలు 457 రకాల వైద్య సేవలను వినియోగించుకున్నారు. స్త్రీల వ్యాధులకు సంబంధించి 141, సాధారణ వ్యాధులు 233, కంటి వైద్య సేవలు 218 మంది వినియోగించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా 25 మందికి కళ్ళ జోళ్ళను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఏరువ పద్మావతి, తోకావారిపాలెం సర్పంచ్ దొడ్డా సామ్రాజ్యం, గోర్లవారిపాలెం సర్పంచ్ నల్లమేకల అప్పమ్మ, మండల ప్రత్యేక అధికారి ఎల్ వజ్రశ్రీ, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీడీవో ఎస్ ఆదినారాయణరావు, తహసీల్దారు సాంబశివరావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, మెట్టు వెంకటప్పారెడ్డి, నల్లమేకల మాధవరావు, ఆవుల సుందర్‌రెడ్డి, వెంకటరావు, ప్రజలు తదితరులున్నారు.

356 మందికి వైద్య పరీక్షలు

పెదనందిపాడు: ప్రభుత్వం అందిస్తున్న వైద్య ఆరోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రభుత్వం అందరికి అన్ని రకాల వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తుందని తహసీల్దార్ సుభాని అన్నారు. మంగళవారం ఉదయం మండల పరిధిలోని గోగులమూడి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో 356 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో సర్పంచ్ సీహెచ్ నరసింహారావు, ఈవోపీఆర్డీ సాయిలీల, వైద్యాధికారులు లావణ్య, ఎండీ అతియా, వి.అనిల్ కుమార్, సీహెచ్‌వో ప్రసాద స్వామి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వడ్లమూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. స్థానిక గొడపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన మెగా మెడికల్ క్యాంప్‌లో గుండె, కంటి, స్త్రీ, బీపీ, షుగర్, తదితర వ్యాధులకు చెందిన స్పెషలిస్టు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజా ప్రతినిధులు, మండల, పంచాయతీ అధికారులు పర్యవేక్షించారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, పీఎస్ వైపీఏ ప్రసాద్, చేబ్రోలు, వేజండ్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, వడ్లమూడి సచివాలయ సిబ్బంది, సర్పంచ్ మోరంపూడి అనితారాణి, ఉప సర్పంచ్ హుస్సేన్, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, పెదమస్తాన్, పి.శివాజీ, కె.మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

తక్కెళ్ళపాడులో జగనన్న ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన

పెదకాకాని: ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి పరిష్కరించడమే ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తక్కెళ్ళపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు విచ్చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో పనిచేసిన ఏ ప్రభుత్వాలు చేయని విధంగా ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. పేషెంట్ల సమస్య ఆధారంగా అవసరాన్ని బట్టి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్స్ చేయడం కూడా జరుగుతుందన్నారు. ఈ శిబిరం ద్వారా 511 మందికి వైద్యసేవలు అందించారు. వైద్య శిబిరం ఏర్పాట్లను పెదకాకాని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పుసులూరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. 164 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 145 మందికి కళ్ళజోళ్ళు ఇస్తామన్నారు. కంటి శస్త్ర చికిత్సలకు 8 మందిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సీహెచ్ విజయప్రకాష్, డాక్టర్ అనూష, డాక్టర్ భవిష్యలు వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఏర్పాటు చేసి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, తహసీల్దార్ పి.రత్నం, మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, హెచ్‌ఎం జీఎం శ్రీనివాసరెడ్డి, అప్పసాని చంద్రశేఖర్, కిలారి రమేష్, కగ్గా శివయ్య, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష...ప్రజల ఆరోగ్యానికి రక్ష

రేటూరు(కాకుమాను): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు రాష్ట్ర ప్రజలకు రామ రక్షగా ఉంటున్నాయని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని రేటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాలలో సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ శిబిరాలలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ అసదుల్లా, మండల ప్రత్యేకాధికారి తేళ్ల ప్రేమ కుమారి, గ్రామ సర్పంచ్ షేక్ సైద, ఉప సర్పంచ్ వల్లూరి సుధాకర్, కో–ఆప్షన్ సభ్యులు సుభాని, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు బీపీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎంలు



నేత్ర పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వృద్ధులు



వృద్ధులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు



శిబిరంలోనే చేస్తున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



వృద్ధునికి నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాములు





వడ్లమూడి గొడపాలెం ప్రభుత్వ పాఠశాలలో సురక్ష శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా

ఓటరు సర్వేలో సందేహాలను పరిష్కరించాలి



పొన్నూరు : నియోజకవర్గంలో జరుగుతున్న ఓటరు సర్వేలో రాజకీయ పార్టీల సందేహాలను, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఓటరు నమోదు అధికారి హరిహరనాథ్ అధికారులకు సూచించారు. మంగళవారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు సర్వేపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన ఓటర్ల జాబితా నమూనా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 12వ తేదీ వరకు ఏమైనా సమస్యలు, అభ్యంతరాలను తెలియచేయాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు సూచించిన విధంగా సౌకర్యాలు లేని పలు పోలింగ్ కేంద్రాలను మార్పు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఆమోదానికి పంపించినట్లు ఆయన తెలియజేశారు. నిరంతరం ఫారం 6,7,8 లను దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటర్ల తుది జాబితా ప్రదర్శన జనవరి 5వ తేదీన జరుగుతుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, చేబ్రోలు డిప్యూటీ తహసీల్దార్ ప్రణతి, పొన్నూరు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఫణి కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: విద్యార్థి నైపుణ్య సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడంలో మానసిక ఆరోగ్యస్థితి ప్రభావం ఎంతగానో ఉంటుందని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ కంటా జగదీశ్ పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో మంగళవారం వరల్డ్ మెంటల్ హెల్త్ డే (ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం) పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఉజ్వల భవిష్యత్తుకు విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. ప్రతి రోజు ఎదురయ్యే ఒత్తిడుల నుంచి తట్టుకునేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శరీరం, మనస్సు రెండు పరస్పర ఆధారితాలేనని, శారీరక ఆరోగ్యం పనులకు అవసరమైన సామర్థ్యం కల్పిస్తుందని, మానసిక ఆరోగ్య బలం మేధాశక్తిని మెరుగు పరచడానికి కారకం అవుతుందని తెలిపారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి అవసరమైన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను చేబడుతున్నట్లు కళాశాల సెక్రటరీ–కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు. ప్రతి విద్యార్థి ఆరోగ్య భద్రతకు సమయం కేటాయించాలని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిని ఘనంగా సన్మానించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డాక్టర్ లక్ష్మీరాణి పాల్గొన్నారు.

తల్లి, కుమార్తె కనిపించకుండా పోయిన ఘటనపై కేసు



విజయలక్ష్మి



కుమార్తె దేగల శిరీష

గుంటూరు రూరల్: తల్లి, కుమార్తె కనిపించకుండా పోయిన ఘటనపై కేసు నమోదు అయిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం హిమనినగర్ 4వ లైనులో దేగల విజయలక్ష్మి, ఆమె కుమార్తె దేగల శిరీష ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, విజయలక్ష్మి భర్త దేగల శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పిచ్చి కుక్క దాడిలో 8 మందికి గాయాలు

పెదనందిపాడు: పిచ్చి కుక్క దాడిలో 8 మందికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మండల కేంద్రం పెదనందిపాడులో మంగళవారం ఉదయం పిచ్చి కుక్క ఎస్సీ కాలనీలో పలువురిపై దాడి చేసి విచక్షణ రహితంగా కరిచింది. పిచ్చికుక్క విషయం తెలుసుకున్న యువకులు దానిని వెంటాడి చంపివేశారు. బాధితులు అంతా పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఇంజక్షన్లు చేయించుకున్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కొరకు గుంటూరు జీజీహెచ్‌కు ఆరోగ్య శాఖ సిబ్బంది రిఫర్ చేశారు. కాగా పిచ్చి కుక్క దాడిలో గాయపడిన వారిని సర్పంచ్ దాసరి పద్మారావు, మండల కన్వీనర్ షేక్ ఖాశీంపీరాలు పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో కుక్కలను పట్టించామని, పక్క గ్రామాల నుంచి అధికంగా కుక్కలు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



ప్రత్తిపాడు: వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు చేయవచ్చని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. ఆల్ రౌండ్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ సీఎస్ఈ డేటీ సైన్స్ తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. హ్యాకథాన్‌లో వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 175 టీంలు పాల్గొన్నాయి. 25 టీంలు ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించగా అందులో నాలుగు టీంలు తమ కిట్స్ కళాశాల విద్యార్థులేనని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు తెలిపారు. ఫైనల్స్‌కు అర్హత సాధించిన టీంలు ఈ నెల 30వ తేదీన న్యూఢిల్లీలో జరగనున్న ఫైనల్ హ్యాకథాన్‌లో పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎప్పటికప్పుడు మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సమాజానికి కావలసిన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. డైరెక్టర్ హరిబాబు, విభాగాధిపతి భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఐదుగురు డీలర్ల నుంచి రూ.70 వేలు జరిమానా వసూలు



నగరంపాలెం: గుంటూరు నగరంలోని పలు సెల్‌ఫోన్ల దుకాణాలలో విజిలెన్స్, తూనికలు – కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు నేతృత్వంలో మంగళవారం కొత్తపేట, బ్రాడీపేట, అరండల్‌పేటలో పది దుకాణాలల్లో తనిఖీలు కొనసాగాయి. డిక్లరేషన్స్ ఎంఆర్‌పీ, వినియోగదారుల వివరాల్లేకుండా పరికరాలు కొనుగోలు చేసి విక్రయించే వారిపై పది కేసులు నమోదు చేశారు. ఐదుగురు డీలర్ల నుంచి రూ.70 వేలు జరిమానా వసూలు చేశారు. మిగతా దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐలు ఎ.శ్రీహరిరావు, ఎస్.శ్రీనివాసులురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి, తూనికలు – కొలతల శాఖ అధికారి సునీల్‌రాజు పాల్గొన్నారు.

జనంపై విరుచుకుపడుతున్న శునకాలు

- గుంపులు గుంపులుగా వీధుల్లో సంచారం
- బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం

ప్రత్తిపాడు: కుక్కలు క్రూర మృగాల్లా జనంపై విరుచుకుపడుతున్నాయి. ప్రజల వెంటపడుతూ పేగులు రక్కేస్తున్నాయి. నక్కి నక్కి దాడి చేస్తూ కండలు పీకేస్తున్నాయి. జనాన్ని రక్తపు మడుగులో పడేస్తున్నాయి. కాలభైరవుల దాడులకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

పట్టించుకోని పంచాయతీలు..

మేజర్ పంచాయతీ ప్రత్తిపాడులో శునకాలు స్వైర విహారం చేస్తున్నా, ప్రధాన రోడ్లపై గుంపులుగా సంచరిస్తూ కనిపించిన వారిపై దాడులకు పాల్పడుతున్నా కుక్కల నియంత్రణకు అధికారగణం చర్యలు చేపట్టడం లేదు. దీంతో కుక్కల దాడులు అధికమవుతున్నాయి. పగలే ఇలా ఉందనుకుంటే రాత్రి సమయాల్లో అయితే సమస్య మరింత తీవ్రతరంగా ఉంటుంది. ద్విచక్రవాహనదారుల వెంట పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు.

- వారం రోజుల కిందట గుంటూరు నుంచి ప్రత్తిపాడు మీదుగా పర్చూరుకు స్కూటీపై వెళుతున్న కోటేశ్వరరావు వెంట కుక్కల మూక పడింది. దీంతో అతని వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. అదృష్టవశాత్తూ అతనికి ఎలాంటి ప్రాణాపాయం చోటుచేసుకోలేదు.
- అదేవిధంగా ప్రత్తిపాడుకు చెందిన మరో వ్యక్తి కూడా కుక్కల నుంచి తప్పించుకోబోయి స్వల్పగాయాలపాలయ్యాడు.
- ఇలా అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీలను వివరణ కోరేందుకు సాక్షి ప్రయత్నించగా వారు ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.



ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

శలపాడులో యువకుడు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న దాసరి ప్రభుకుమార్ మృతదేహం వద్ద

శలపాడు(చేబ్రోలు): కుటుంబ సమస్యల కారణంగా యువకుడు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. కృష్ణాజిల్లా మొవ్వ ప్రాంతానికి చెందిన దాసరి ప్రభుకుమారు (25) క్యాటరింగ్ పనిచేసుకొని జీవిస్తున్నాడు. నాలుగు సంవత్సరాల క్రితం చేబ్రోలు మండలం శలపాడు గ్రామానికి చెందిన మాలతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇరువురు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిస అయిన ప్రభుకుమార్ తరచుగా భార్యభర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం మద్యం మత్తులో ఉన్న ప్రభు భార్యను వేధిస్తుండటంతో ఆమె డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. మాలతి ఫిర్యాదుతో ఇంటికి వచ్చిన పోలీసులు ఆరా తీయగా ఇంటిలో తలుపులు వేసుకొని లోపల ఉన్నట్లు ఆమె చెప్పింది. తలుపులు తీసి బయటకు రమ్మని పోలీసులు, కుటుంబసభ్యులు చెప్పినప్పటికి రాకపోవటంతో కొద్దిసేపటి తరువాత అందరూ వెళ్లి పోయారు. ఎంత సేపటికి భర్త తలుపులు తీయకపోవటంతో కిటికీలో నుంచి లోపలికి చూడటంతో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించి తలుపులు పగల కొట్టి లోపలికి వెళ్లారు. 108 సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులకు భయపడి మృతుడు ప్రభుకుమార్ ఉరివేసుకొని మరణించినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

నేడు నంబూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదకాకాని: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలనే ఆశయంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం మండలంలోని నంబూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతుందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ వైద్య శిబిరం ద్వారా ఆరోగ్య సమస్యలు ఉన్నవారందరూ వైద్యసేవలు పొందే విధంగా 15 రోజులుగా గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి గుర్తించడం జరిగిందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు.

వ్యాయామంతో మానసిక రుగ్మతలు దూరం

డాక్టర్ సయ్యద్ అహ్మద్ బాషా



పెదకాకాని: విద్యార్థులు, యువతను ఒత్తిడి మానసిక రుగ్మతల నుంచి వ్యాయామం, ధ్యానం దూరం చేస్తాయని ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ అహ్మద్ బాషా అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో మంగళవారం విద్యార్థులలో మానసిక ఆరోగ్యం, ఒత్తిడిని దూరం చేయడంపై అవగాహన కలిగించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి డాక్టర్ సయ్యద్ అహ్మద్ బాషా ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మనిషి యాంత్రిక జీవనాన్ని గడుపుతున్నాడని నిత్యం యంత్రంలా పని చేయడం వలన ఒత్తిడికి గురవుతున్నారని, విద్యార్థులు మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారన్నారు. అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. శారీరక ఆరోగ్యం బాగుండాలి అంటే మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలన్నారు. సామాజిక మాధ్యమాల వలన మానసిక అనారోగ్యాన్ని ఎదుర్కొంటున్నారని, చదువు రోజు వారి పనులలో వెనుక బడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై మల్లిఖార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్ కుమారస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఐఎల్‌జే భక్తాసింగ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ బాషాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి

మానసిక ఆరోగ్యంపై అవగాహనా ర్యాలీ

ఏఎన్‌యూ: యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సెలింగ్ సెంటర్, ఎడ్యుకేషన్ విభాగం సంయుక్తంగా మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. 'మన మనసు – మన హక్కులు' అనే నినాదంతో పోస్టర్‌ను వీసీ ఆ చార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉద్యోగుల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఎడ్యుకేషన్ విభాగా ధిపతి డాక్టర్ బ్రహ్మాజీ రావు, డాక్టర్ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య విద్యార్థులతో కలిసి యూనివర్సిటీలో కరపత్రాలను పంపిణీ చేశారు. సైకాలజిస్ట్ డాక్టర్ డి.సరోజ, డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ కళాశాలకు ఎన్ఐఆర్ఎఫ్ ఆలిండియా 89వ ర్యాంకు



మంత్రి బొత్స చేతుల మీదుగా అవార్డ్ అందుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు

గుంటూరు రూరల్: ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా విధానాలను పరిశీలించి జాతీయ స్థాయిలో ఎన్ఐఆర్ఎఫ్ సంస్థ అందించిన ర్యాంకులలో తమ కళాశాలకు ఆల్ ఇండియా 89వ ర్యాంక్ రావటం గర్వంగా ఉందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) ఆధ్వర్యంలోని క్వాలిటీ అష్యూరెన్స్ సెల్(క్యూఏసీ) విజయవాడలో నిర్వహించిన రసస్వద 2023 వేడుకల్లో ఈ ర్యాంక్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, శ్రీసిటీ ఐఐటీ కళాశాల చైర్మన్ ఎం.బాలసుబ్రమణ్యన్, ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావుల చేతుల మీదుగా అవార్డును అందుకోవటం సంతోషంగా ఉందన్నారు. అధునాతన విద్యా విధానాలు, అధ్యాపకులు, విద్యార్థుల పరిశోధనలు, మౌలిక వసతులు, ప్రాంగణ ఎంపికలు, విద్యార్థులకు అందించే సదుపాయాలు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు తదితర విభాగాలను పరిశీలించి ఈ ర్యాంక్‌లను ఎన్ఐఆర్ఎఫ్ అందిస్తుందన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో శాశ్వత అనుబంధ కళాశాలగా అనుమతి పొందటమే కాకుండా ఏఎన్‌యూ, కృష్ణ విశ్వవిద్యాలయం పరిశోధన కళాశాలగా, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, యూజీసీ, ఐఎస్ఓ, ఎన్‌బీఏ గుర్తింపు పొందిన అటానమస్ కళాశాల తమదని తెలిపారు. కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చేందుకు కృషిచేసిన ప్రిన్సిపాల్‌ను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.